# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ప్రణాళికశాఖతో సహా పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.
2. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఎగువన ఉన్న రాష్ట్రానికి ఎటువంటి నష్టం జరగదని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.
3. రోజువారీ దిన చర్యలో యోగాను భాగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు.
4. ఏలూరు జిల్లా కొల్లేరు సరస్సు అధ్యయనం కోసం నియమించిన కేంద్ర సాధికారత కమిటీ బృందం ఈ రోజు పలు గ్రామాల్లో పర్యటిస్తోంది.
5. ఉపాధ్యాయ పరీక్షలకు నిర్వహించిన డీఎస్సీ మైనర్ మాధ్యమ భాషల పరీక్షల ప్రాథమిక 'కీ'ని పాఠశాల విద్యాశాఖ ఈరోజు విడుదల చేసింది.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో ప్రణాళికశాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ శాఖల వారీగా శాఖల ప్రణాళిక లక్ష్యాల సాధన పై అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం సర్క్యులర్ ఎకానమీపై సమీక్ష నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు.

--------------------------

చిత్తూరు జిల్లా కుప్పంలో ఓ మహిళను చెట్టుకు కట్టి దాడి చేసిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీతో మాట్లాడి ఆదేశాలు జారీ చేయగా... నిందితుడిని అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ తెలిపారు. మహిళలను హింసించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

--------------------------

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఎగువన ఉన్న రాష్ట్రానికి ఎటువంటి నష్టం జరగదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గోదావరి వరద

జలాల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

.వాయిస్..30

---

విశాఖపట్నంలో జరిగే ప్రపంచ యోగా దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి తెలిపారు. విశాఖలోని బీచ్ రోడ్డులో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రణాళిక ప్రకారం రవాణా, ఆహార సౌకర్యాలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ వేడుకలోప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

ఇదిలా ఉండగా విశాఖపట్నంలో జరిగే ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. విశాఖ బీచ్ రోడ్డులో ఈ రోజు నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ వరకు రెడ్ జోన్ గా ప్రకటించారు. ఈరోజూ నుంచి ఆర్కే బీచ్ రోడ్డును మూసివేయనున్నామని ఈ నెల 21 వరకు 5 కిలో మీటర్ల పరిధిలో డ్రోన్లపై నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

---

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా కొల్లేరు సరస్సు అధ్యయనం కోసం నియమించిన కేంద్ర సాధికారత కమిటీ-సీఈసీ బృందం ఈ రోజు, రేపు కొల్లేరు గ్రామాల్లో పర్యటిస్తోంది. ఈ బృందం ఈ రోజు కలకుర్రు, మణుగులూరు, ఆటపాక, కొల్లేటికోట గ్రామాలను సందర్శించి సాయంత్రం కొల్లేటికోట, కైకలూరు, ఉండి మండలాలకు చెందిన భూముల రైతులు, కొల్లేటివాసులతో సమావేశమవుతుందని అధికారులు తెలిపారు. కాగా రేపు. నిడమర్రులో కొల్లేరు వన్యప్రాణి అభయారణ్యం ప్రాంతాలను పరిశీలించనుంది.

---

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీకాకుళం, తిరుపతి, జిల్లాల్లో యోగా కార్యక్రమాలు ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. కర్నూలులో పారిశుద్ధ్య కార్మికులతో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పరిశ్రమల శాఖమంత్రి టి.జి.భరత్ పాల్గొని .. మాట్లాడుతూ..

..వాయిస్... 27 సెకన్లు

---

రోజువారీ దిన చర్యలో యోగాను భాగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా, వెంగళరాయ సాగర్ ఏనుగుల కొండ వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యోగా, క్రీడలు అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా యోగాకు ప్రాచుర్యం కల్పించడమే యోగాంధ్ర లక్ష్యమని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---

ఈరోజు ప్రపంచ ఎడారీకరణ, కరవు నివారణా అంశంపై అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. వాతావణ కాలుష్య నివారణకు చర్యలు చేపట్టడం, ప్రకృతి వనరులను పరిరక్షించడం, నేల సారవంతాన్ని కాపాడడం, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై ఈరోజు అవగాహన కల్పిస్తారు. ప్రతి ఏటా జూన్ 17వ తేదీన ఎడారీకరణ, కరవు నివారణా అవగాహనా దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ 1994 సంవత్సరంలో ఇచ్చిన పిలుపుమేరకు ప్రతిఏటా ఇదేరోజున ఈ కార్యక్రమం జరుగుతోంది.

---------------------------

గుంటూరు జిల్లాలో నేరాల నియంత్రణకు, ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. భద్రత కోసం నూతనంగా వచ్చిన 33 ద్విచక్రవాహనాల్ని గుంటూరులో ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ

..వాయిస్... 29 సెకన్లు

---------------------------

జాతీయవాది, దేశభక్తులు, ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మి నరసింహం వర్ధంతి ఈరోజు. 1867వ సంవత్సరం సెప్టెంబరు 26వ తేదీన ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లా ఖండవల్లి గ్రామంలో ఆయన జన్మించారు. ద్రౌపది పరిణయం, శ్రీరామ జననం వంటి నాటికలు, రామచంద్ర విజయం, హేమలత వంటి నవలలు రాసిన ఆయన మహాకవి, కళాప్రపూర్ణ అనే బిరుదులు పొందారు. ఆయన రచించిన గణపతి నవల హాస్య రచనలలో ఎన్నదగినది. "భరత ఖండంబు చక్కని పాడియావు" పద్యంతో ప్రసిద్ధి పొందిన లక్ష్మీ నరసింహం 1946 జూన్ 17వ తేదీన కన్నుమూశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

ఉపాధ్యాయ పరీక్షలకు నిర్వహించిన డీఎస్సీ మైనర్ మాధ్యమ భాషల పరీక్షల ప్రాథమిక 'కీ'ని ఈరోజు కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి విడుదల చేశారు. కన్నడ, ఒడియా, తమిళం, ఉర్దూ విభాగాలకు చెందిన 'కీ' ఈరోజు నుంచి సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరీక్షల రాసిన అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో ఈ నెల 23 లోపు తెలపాలని సూచించారు.

=====================